# * మొగుడూ పెళ్లాంకబుర్లు

"……… ……"

"……… ……"

"మీ స్నేహితుడు సోమయ్యగారి పెళ్లాం చెప్పిందండీ 'మా ఆయన నన్నేమనరు, పాపం మంచివారు! నాకే ఎప్పుడేనా కోపం వేసుకొస్తూవుంటుంది కేకలేస్తూవుంటానని. ఆయన్ని మొన్న సాయింత్రం అడిగిందట, మా అప్పకొడుక్కి——"

"ఔనుగాని ఇంకా ఎంతసేపు చెప్తావు చెప్పు, పోనీగాని. ఇప్పటికి రెండు గంటలనుంచి చెప్తున్నావు, అల్ల ఆ జతను గురించీ, ఇల్ల ఈజతనుగురించీ. ఇంకా ఎంతసేపు చెప్తావు, మొగుడూ పెళ్లాల కబుర్లు విసుగేనా వెయ్యదా నీకు?"

"పోనీ లెండిగాని వెంకట్రావుగారు సీతమ్మను చితక పొడి చేశాడుట."

"ఎందుకూ?"

"మరేమీ ఆయనకు ఆసలే విసుగ్గా వుంటూవుంటే ఆవిడ నాకేమేనా చేయించి పెడితేనే పెట్టారు లేకపోతే చచ్చిపోతా నందిట."

"ఆఁ."

"అంటే ఆయన అమట్టుగచస్తే చావనీ అని చితక పొడి చేశాడుట."

"పాపం. ఎంతపని చేశాడు."

"ఆయనైనా పాపం ఆవిణ్ణి ఎప్పుడూ కొడుతూవుండడుట. ఆ సంగతి ఆవిడే చెప్పింది మొన్న పేరంటానికి వచ్చినప్పుడు."

---

* వినోదిని డిశంబరు 1934

"అదిగో మళ్లా మొదలెట్టావు మొగుడూ పెళ్లాల కబుర్లు. దానికో అంతూపంతూ అంటూ లేదా అని నేననడం. నువ్వూ నేనూ ఒంటరిగా కూచున్నప్పుడు ఇంతకుమించి మరో సంగతి ఎప్పుడేనా మాట్లాడావూ. ఇది తప్పని నేను చెప్పడంలేదు. వాటినిగురించికూడ చెప్పుకోవలసిందే. కాని ఎప్పుడూకూడా వాటిని గురించేనా? ఎప్పుడు విన్నా అవేనా? లోకంలో తెలుసుకోవలసిన సంగతులు యింకా చాలా వున్నాయి కదా?"

"ఇంకా ఏమున్నాయో చెప్పండీ పోనీ."

"రోజూ ఇంటికి ఆంధ్రపత్రిక తెప్పిస్తున్నాను. అది చదువుతూవుంటే ఎన్నేనా సంగతులు తెలుస్తాయి."

"పోనీ చెప్పండీ మీకు తెలిసిన సంగతులేమిటో. నాకు తెలిసిన సంగతులు నేను చెప్పాను."

"అదిగదే నేనూ అనడం. నువ్వు మొగుడూ పెళ్లాం కబుర్లకంటే ఎక్కువ తెలుసుకోవాలని. ఆంధ్రపత్రిక చదువుతూవుంటే ఎన్నేనా సంగతులు తెలుస్తాయి."

"పోనీ చెప్పరాదూ మీకేమేమి సంగతులు తెలుసో, నేనూ వింటాను."

"అయితే విను. గాంధీ మహాత్ముడు కాంగ్రెసునుంచి విడిపోతానంటున్నాడు."

"పాపం, ఏం చేసిందీ?"

"ఒంటికేమీ చెయ్యలేదు. ఆయన చెప్పినవన్నీ కాంగ్రెసు సభ్యులు ఒప్పుకోడంలేదు. అందుచేత."

"ఏమేమిటి?"

"కాంగ్రెసు సభ్యత్వానికి చెల్లించవలసిన పావలాసూలు రూపంగా వుండాలన్నాడు. కాంగ్రెసు సభ్యుడు ఖద్దరు తప్ప

మరొకటి కట్టుకోకూడ దన్నాను."

"పోనీ ఇవన్నీ ఆయన పెళ్ళామేనా చేస్తూందా?"

"ఆవిడ చెయ్యకేం?"

"అయితే ఆవిడ ఇప్పుడు ఎక్కడుంది?"

"ఆయనదగ్గిరే వుండేమా."

"ఇద్దరూ ఎప్పుడేనా మాట్లాడుకుంటూరా?"

"మళ్ళా మొగుడూ పెళ్ళాం కబుర్లలోకి దించావూ?"

"అబ్బే! వాళ్లిద్దరూ అన్యోన్యంగా వుంటూరా అని అడగడం."

"ఆయన గృహస్థ సన్యాసి. అటువంటివాడికి ఇంకా పెళ్ళామంటూ యెక్కడ!"

"పాపం! పోనీగాని వీరేశలింగంగారిని గురించి చెప్పండి జాగ్రత్తగా వింటాను."

"పోనీ అలేనా విను."

"వీరేశలింగంగారు మహాచెడ్డ కష్టపడ్డాడు బాల వితంతువులకు వివాహం చెయ్యడంకోసం."

"అదీ ఒక మంచిపనే! ఇప్పుడు అంతా అలాగే చేసుకొంటున్నారు కాబట్టి అదీ ఒక మంచిపనే అయిపోతూంది లెండి."

"ఎన్నో బాధలు పడ్డాడు పాపం ఆపెళ్ళిళ్ళు చెయ్యడానికి."

"సరేగాని చివరికి ఇంట్లో పెళ్లామేనా ఒప్పుకుందా?"

"ఆయన భార్యపేరు రాజ్యలక్ష్మి. ఆవిడ పాపం చాలా మంచియిల్లాలు. ఆవిడ సహాయం చెయ్యబట్టే ఆయన యిన్ని పనులు చెయ్యగలిగాడు."

"మొగుడంటే ప్రేమే పాపం! మంచి యిల్లాలే!"

"ఒకమారు అవిణ్ణి బంధువులంతా—"

"అయితే ఆయనకి కూడ ఆవిడమీద ప్రేమ వుండేదా ?"

"అదిగో మళ్ళా అవే కబుర్లు మొదలెట్టావు. ఎన్నిసార్లని చెప్పడం నీకు ? మరోటి చెబుతున్నా మళ్ళా అదేనా ? చదువు కుంటే యిలాంటివన్నీ తగ్గిపోతాయి."

"మన యింటిపక్కని రాజేశ్వరరావుగారు తనకు కావలసిన వన్నీ కొనుక్కోమంటాడుట సీతమ్మగారిని."

"ఈ కబుర్లలో అంతంటూ లేదా అని నేనడగడం. ఇంత కంటే ఎక్కువ సంగతులు తెలుసుకో అక్కర్లేదాఅని, నేనండన. ఇంతకంటే ఎక్కువ సంగతులు తెలుసుకొంటేను నువ్వూ ఎంత సేపూ వీటినిగురించే మాట్లాడతావా ? మన బాగుకోసం, లోకం బాగుకోసం యింకాఎన్నో విషయాలనుగురించి మాట్లా డవలసివుంది. మనఇద్దరం ఒంటరిగా కూచున్నప్పుడల్లా విసుగూ విరామంలేకుండా ఇవేకబుర్లు చెప్తావుకదా. నీవల్ల చివరికి నేను కూడా చెడిపోతున్నాను. నన్నుకూడా పాడు చేస్తున్నావు. ఎంత దానివో నువ్వు. ఎంతసేపూ అవేకబుర్లాఅని."

"నాకేవి తెలుసో అవి చెప్తాను. అంతకంటే మరేం చెప్ప మన్నారు నన్ను ?"

"అందుకనే నిన్ను ఆంధ్రపత్రికని చదవమంటూ వుండడం. స్త్రీలు చేసే సభలకు వెళ్ళమంటూ వుండడం."

"అలాగే చేస్తాను లెండి యింక."

"అదిగో మీ మామగారు చెయ్యి కడుక్కుంటూన్న చప్పు డవుతూంది వెళ్ళు; ఏదేనా పని చెయ్యవలసి వుంటుంది."

"ఆవిణ్ణికూడా భోంచెయ్యనియ్యండి. నా భోజనం మీ భోజనం అయిపోయేయికా."

---